క్లుప్తంగా

కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూప

అగనంపూడి: కిశోర బాలికలు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వడ్లపూడి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వరూప సూచించారు. పౌష్టికాహారం, ఆరోగ్యసూత్రాలు, వ్యక్తిగత ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి బాలికలకు అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. పాఠశాలల్లో అందించే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విధిగా తీసుకోవాలని, రక్తహీనత లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు, స్కౌట్స్ గైడ్ టీచర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌క్లబ్‌లో ఉగాది వేడుకలు నేడు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 స్టీల్‌క్లబ్‌లో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి జి. నారాయణ దొర తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు అద్దంకి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కవి సమ్మేళనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందజేయనున్నామని తెలియజేశారు. స్టీల్‌క్లబ్ సభ్యులు కుటుంబ సభ్యులతో వేడుకలకు హాజరు కావాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4లక్షల 90వేలకు మూడు చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. అయినవిల్లి పైడిరాజుకు రూ.40వేలు, గురవం లహరికి రూ.3లక్షల 20వేలు, మీరా మొహిద్దీన్ షరీఫ్‌కు రూ.1లక్షా 30వేల రూపాయల చెక్కును ఆయన స్వగృహంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, మార్టుపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు



సంబరాల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉగాది సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదనానికి ప్రతీకగా నిలిచే సంవత్సరాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని రెక్టార్ మధుసూదనరావు ఆకాంక్షించారు. ఉగాది పండగ అంటే షడ్రుచులు గుర్తుకొస్తాయని, మనిషి జీవితం కూడా షడ్రుచుల సమ్మేళనమని అన్నారు. సంబరాల్లో భాగంగా విద్యార్థులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డీన్ బి.సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవులను సత్కరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: ఉగాదిని పురస్కరించుకుని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహిత్య సుధ వ్యవస్థాపకుడు అద్దంకి రాఘవాచార్యులు పంచాంగ పఠనం చేశారు. ఈ ఉగాది అందరికీ ఉషస్సులు పంచాలని ఆకాంక్షించారు. ఆలపాటి సాంబశివరావు, డాక్టర్ పి.హేమలత, అప్పారావు కవితలు వినిపించారు. అనంతరం కవులను సత్కరించారు. ఎస్.చలపతిరావు, జీవీఎస్ఎన్ రాజు, దేవులపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాగి జావలో పోషకాలు పుష్కలం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- జగనన్న గోరుముద్దలో భాగంగా పాఠశాలల్లో పంపిణీ ప్రారంభం



అగనంపూడి జెడ్పీ హైస్కూల్లో రాగిజావ అందిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి



కణితి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న ఉపాధ్యాయులు



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో విద్యార్థులకు రాగి మాల్ట్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు



రాగిజావ పంపిణీలో పాల్గొన్న దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఇమ్రాన్, రామారావు



సిద్దేశ్వరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థితో రాగిజావ తాగిస్తున్న వంశీరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: రాగిజావలో పోషకాలున్నాయని, అవి విద్యార్థుల్లో ఎదుగుదలకు, చురుకుదనానికి దోహదపడతాయని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాగిజావను మెనూలో చేర్చారని తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన రాగి మాల్ట్ (జావ)ను ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద ద్వారా ప్రోటీన్లు, మినరల్స్, విటమిన్లతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో చురుగ్గా ఉంటారని భావించి, పోషకాహారాన్ని అందిస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నంబారు రాజు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

- 68వ వార్డు మింది జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఆంజనేయ చేతుల మీదుగా విద్యార్థులకు రాగి జావను అందజేశారు.
- 69వ వార్డు తుంగ్లాం, కాపుతుంగ్లాం, నాతయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి రాగి జావను అందించారు.

66, 71 వార్డుల్లో..

గాజువాక: గాజువాకలోని వివిధ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బడిపిల్లలకు మరో పోషకాహారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు పాల్గొన్నారు.

- 70వ వార్డు చిట్టినాయుడు కాలనీ, చట్టివానిపాలెం, ఎల్‌బీఎస్ నగర్ ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఉరుకూటి చందు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

85వ వార్డులో..

అగనంపూడి: అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దానబోయినపాలెం ప్రాథమిక పాఠశాలల్లో రాగి మాల్ట్ పంపిణీ కార్యక్రమాన్ని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రారంభించారు. పాఠశాలల హెచ్‌ఎంలు కృష్ణారావు, గణేష్, వార్డు వైఎస్సార్సీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, ఎల్.వి.రమణ, యలమంచిలి అప్పారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

- 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, కమిటీ చైర్మన్ కరణం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డులో..

పెదగంట్యాడ: విద్యార్థులకు మంచి ఆరోగ్యంతో పాటు శరీర దృఢత్వానికి రాగి జావ మేలు చేస్తుందని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. పలు పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిద్దేశ్వరం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రమేష్, లత, ఏసుప్రసాద్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

- నడుపూరు ఎంపీపీ పాఠశాలలో రాగి జావ పంపిణీని వైఎస్సార్ సీపీ 76వ వార్డు నాయకుడు మంత్రి శంకరనారాయణ, పైడిమాండ సంక్షేమ సంఘం చైర్మన్ ములగపాక అచ్చింనాయుడు ప్రారంభించారు.
- నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ రాగి జావ పంపిణీని ప్రారంభించారు.

కణితి హైస్కూల్లో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో భాగంగా వారంలో మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో రాగిజావను అందిస్తామని తెలిపారు. పీడీ మన్నాజీ, ఎ.శ్రీనివాస్, ఎస్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రజల ఆస్తి



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి దేశసంపదను అమ్మే హక్కు లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. విశాఖ ఉక్కు దేశ ప్రజల ఆస్తి అని, దానిని ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి పోనివ్వకుండా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 768వ రోజు, మంగళవారం సీవో, సీసీపీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉక్కు ఉత్పత్తులు తయారీకి కావలసిన రా మెటీరియల్స్‌ను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజా ఉద్యమాలకు ఎంత పెద్ద నియంతైనా తలవంచక తప్పదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రి రహదారి విస్తరణకు వినతి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఏడు మెట్ల మర్రిపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ కాలనీ వరకు రహదారిని విస్తరించాలని వార్డుకు చెందిన ప్రజా సంఘాల నాయకులు ఎమ్మెల్యే నాగిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. రహదారి మలుపులతో ఉండడం, ఇరుకుగా ఉండడం వల్ల మూడు రోజుల క్రితం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గతంలో రహదారి విస్తరణకు జీవీఎంసీ ప్రతిపాదనలు చేసిందని పేర్కొన్నారు. హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రావడంతో, రహదారి నిత్యం రద్దీగా ఉంటోందని, జీవీఎంసీ స్పందించి చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు ఎస్.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, కె.ముత్యాలు, డి.పైడికొండ తదితరులున్నారు.

ఉక్కు కార్మికుల ధర్నా



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలన్నారు. ఉద్యోగులకు నూతన వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు పన్నినా ఉద్యమాలతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, కేఎస్ఎస్ఎన్ రావు, మసేనురావు, తాతారావు, డీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన అవసరం



లంకెలపాలెం జెడ్పీ హైస్కూల్లో మొక్క నాటుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్యంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృక్షాల ప్రాధాన్యం, ఉపయోగాల గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అటవీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరవాడ ఎంఈవో ఎం.సునీత, పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, క్లస్టర్ కో–ఆర్డినేటర్ బుదుమూరు అన్నాజీరావు, కమిటీ చైర్మన్ కరణం లక్ష్మి, సీఆర్‌పీ నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు దుస్తుల పంపిణీ



ఆటోడ్రైవర్లకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: వెంపళ్లనగర్ సత్యసాయి సేవా సమితి భజన మండలి ఆధ్వర్యంలో 17 మంది ఆటోడ్రైవర్లకు స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని భజన మండలి ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, దుస్తులను అందించారు. కుట్టుకూలి నిమిత్తం ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, బాబూరావు, రామారావు, గంధం సాయి, పోలీస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగి మోడేకుర్తికి ఏసీపీ అభినందన



సత్యనారాయణకు ప్రశంసా పత్రం అందిస్తున్న త్రినాథ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం. విభాగం జనరల్ ఫోర్‌మన్ మోడేకుర్తి సత్యనారాయణను సౌత్ ఏసీపీ టి. త్రినాథ్ అభినందించారు. సత్యనారాయణ దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా అప్పికొండ తీరంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ సిస్టం ద్వారా 27 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. అదే విధంగా సింహాచలం చందనోత్సవం నాడు కొండపైకి వచ్చే భక్తులకు సూచనలు చేస్తుంటారు. ఆయన సేవలను గుర్తించిన సౌత్ ఏసీపీ త్రినాథ్ మంగళవారం ఆయన కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య పూజలు



పెదనడుపూరులోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ



అక్కిరెడ్డిపాలెంలో నూకాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



వడ్లపూడిలోని ఆలయంలో విశేష అలంకరణలో నూకాంబిక అమ్మవారు

గాజువాక: కొత్త అమావాస్య పూజలు గాజువాకలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నూకాంబిక అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు తెల్లవారుజామునుంచే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పలుచోట్ల కుంకుమ పూజలను జరిపించి అమ్మవారికి చీరలను సమర్పించారు. 66వ వార్డు ఇందిరా కాలనీలోని నూకాలమ్మను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని ఆలయంలో కొలువుదీరిన నూకాలమ్మ వారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు.

- 69వ వార్డు తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నాతయ్యపాలెంలో కొలువైయున్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు.

వైభవంగా నూకాంబిక జాతర

పెదగంట్యాడ: మండలంలో నూకాంబిక జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. చిన నడుపూరులో నూకాలమ్మ వారికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి విశేష పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- 76వ వార్డు పరిధిలోని పెదనడుపూరులో ఆలయ కమిటీ సభ్యుడు బొడ్డు కష్టారావు ఆధ్వర్యంలో నూకాంబిక ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక బీజేపీ కో–ఆర్డినేటర్ కె.నరసింగరావు, గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ తదితరులు దర్శించుకున్నారు.
- 74వ వార్డు వెంపళ్లనగర్‌లోని నూకాలమ్మ వారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ ఎస్.రాము తదితరులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గళ్లా శంకర్‌సాయిరాం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దయాల్‌నగర్‌లో స్వర్ణ నూకాంబిక ఆలయంలో, 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలోని ఆలయంలో పూజలు చేశారు. దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి కాలనీలో నూకాంబిక జాతరను ఘనంగా నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వడ్లపూడిలోని నూకాంబిక ఆలయంలో జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొని, పూజలు చేశారు.

జోరుగా ఇసుక పునరుద్ధరణ



సముద్రపు ఇసుకను పునరుద్ధరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో యారాడ బీచ్ సమీపంలో సముద్రపు ఇసుక పునరుద్ధరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. బీచ్ పోషణతో పాటు కమ్యూనిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం పోర్టు సీఎస్సార్ నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్రత్యేక బృందం యారాడ బీచ్ వద్ద సముద్ర తీరానికి సమీపంలో 1.4లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను పునరుద్ధరించింది.